

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మగపిల్లలు** లేని తల్లిదండ్రులు ఎదుర్కొనే అవమానాలు, పొందే అనవసరపు జాలి మా అమ్మ, నాన్న జీవితంలో కూడా ఉన్నాయి. నన్ను మొట్టమొదట ఎత్తుకున్న ఆవిడ "మళ్ళీ ఆడపిల్లే పుట్టింది" అని నవ్వుతూ మా నాన్న చేతిలో నన్ను పెట్టారట.

"ఏం ఫర్వాలేదు, ఏం ఫరవాలేదు. ఆరోగ్యంగానే ఉంది" అని మా నాన్న సంతోషంగా అన్నారని ఆవిడ నాకు అనేక సందర్భాల్లో చెప్పారు.

కావ్య, ఊహ ఇప్పుడు ఉన్నతస్థాయిలో ఉండడం వల్ల మేం ముగ్గురం ఆడపిల్లలమనే సంగతి ఎవరికీ గుర్తుకురాదు. కానీ మా చిన్నప్పుడు "ముగ్గురూ ఆడపిల్లలేనా? అయ్యో పాపం" అని చాలామంది నాముందే అన్నారు. స్కేనింగ్‌లో నేను అమ్మాయని తెలిసాక "మూడో ఆడపిల్ల ఎందుకు? అబార్షన్ చేయించుకో" అని కొంతమంది సలహా ఇచ్చారట. ఠక్కున వారితో స్నేహాన్ని తెంపేసారు మా నాన్న. మరికొంతమంది "మీకు ఇద్దరమ్మాయిలు ఉన్నారు కదా, మూడో అమ్మాయిని మేము పెంచుకుంటాము" అని అడిగారట. అందుకు మా అమ్మ "ససేమిరా కుదరదు. కావాలంటే వచ్చి ఆడుకుని వెళ్ళండి" అని చెప్పిందట. (ఒప్పుకుని ఇచ్చినట్లైతే నా పేరు 'గులాబీ'నో 'మంగతాయారో' అయ్యేది)

'అయ్యోపాపం' అన్న వారిని చూసి "ఆడపిల్లలైతేనేం? నా ముగ్గురు పిల్లల్ని అబ్బాయిలకన్నా బాగా తీర్చిదిద్దుతా" అని మా అమ్మ నిశ్చయించుకుందట. (కావ్య, ఊహ అందుకు నిదర్శనం) కాలేజీరోజుల్లో తన అన్నయ్య పేంట్లు, షర్ట్‌లు వేసుకుని తిరిగిన మా అమ్మ ఈరోజుకీ నన్ను 'ఒరేయ్' అనే సంబోధిస్తుంది..

'అమ్మ అలా పెంచితే నాన్న ఏం చేసారు?' అని ఆలోచిస్తున్నారా? పిల్లల విషయంలోఅమ్మాయా, అబ్బాయా అన్న తేడా మా నాన్నకి లేదు. స్వేచ్ఛని ఇవ్వకుండా నియమ నిష్టలు పెట్టడం మా నాన్నకి ఇష్టంలేదు. మగవాడిలా పెంచడం అంటే జుట్టు కత్తిరించి, మగ దుస్తులు ధరించడం అని నా ఉద్దేశం కాదు. దేన్నైనా ఎదుర్కొనే సాహసం, ఎవరిమీదా ఆధారపడకుండా, స్వతంత్రంగా ఉండడం నేర్పడం. 'ఏ పనీ దొంగతనంగా చెయ్యకూడదు. ఏది చేసినా రైట్ వేలో చెయ్యాలి' అని నాన్న, 'నువ్వేం చేసినా ఫరవాలేదు. కానీ థర్డ్ పర్సన్

నుండి తెలిస్తే మాత్రం ఊరుకోను. ఏం చేసినా చెప్పి చెయ్యి' అని అమ్మ నాకు నేర్పారు. దాంతో అమ్మా, నాన్నతో పంచుకోలేని పని చెయ్యకూడదని అర్థంచేసుకున్నాను. (నేను మగవాడినైనా ఇలాగే పెంచి ఉండేవారు.)

ఎప్పుడైనా ఇంటికొచ్చిన ఫ్రెండ్స్ "లిపి, మీ నాన్న ఇక్కడే ఉన్నారు. వినబడుతుందేమో. మెల్లిగా చెప్పు" అనో, "లిపి లోపలికి వెళ్దాం. ఆంటీ ఇక్కడే ఉన్నారు" అనో అంటే "ఏం ఫరవాలేదు. ఏం కాదులే" అనేదాన్ని. అందువల్ల, నాకు చాలా ఫ్రీడం ఉందని, ఏం చేసినా అడిగేవారులేరని వారి అభిప్రాయం.

వాళ్ళు ఇచ్చిన ఫ్రీడంకి నా అతి తెలివి తోడై మా అమ్మ చాలాసార్లు బలైంది. ఓ రోజు రాత్రి మా అమ్మగదిలోకి వెళ్ళి, "అమ్మా నీకు లాంగ్ డ్రైవ్స్ అంటే భయమని నాకు తెలుసు. నువ్వు ఒప్పుకోవని తెలుసు. అందుకే నీకు కాలేజ్‌కి వెళ్తున్నా అని చెప్పి రేపు ఫ్రెండ్స్‌తో ఎత్తిపోతలు వాటర్ ఫాల్స్‌కి వెళ్తున్నాను. ఒకవేళ లేట్ అయితే భయపడకు. సిగ్నల్ ఉండకపోవచ్చు" అని చెప్పాను. చాలా బాధగా "సరే. నీ ఇష్టం" అని అనడంతో గిల్ట్‌కి మర్నాడు ఇంట్లోనే ఉండిపోయాను. ('వద్దు, వెళ్ళకు' అంటే కథ మరోలా ముగిసేదేమో)

ఇంకోరోజు, "అమ్మా, నా ఫ్రెండ్స్ ఇంట్లో చెప్పకుండా పార్టీకి వెళ్తున్నారట. నేను కూడా నీకు చెప్పకుండా వెళ్తాను. రేపు ఇంట్లో కనపడకపోతే భయపడకు. ఎవరైనా చూసి చెపితే, 'లిపి కాదు' అనకు. అది నేనే అయ్యుంటా. కానీ, నేను వెళ్ళినట్టు నీకు తెలిసినట్టు ఉండకు" అని అన్నాను.

"చెప్పకుండా ఎందుకు? బెల్ కొడితే నేనే తలుపు తెరుస్తాను. పక్కింటివాళ్ళు చూస్తే దొంగనుకుని పోలీసులకి ఫోన్ చేస్తారు" అని నవ్వింది.

"అబ్బా, అలా కాదమ్మా. నా ఫ్రెండ్స్ ఇంట్లో చెప్పకుండా వెళ్తున్నారట. నాకూ అలానే వెళ్ళాలని ఉంది" అన్నాను.

"నీ ఫ్రెండ్స్ ఇంట్లో ఒప్పుకోరు కాబట్టి వాళ్ళు చెప్పట్లేదు. దొంగతనంగా వెళ్ళాల్సిన కర్మ నీకేం పట్టింది? నువ్వు జాగ్రత్తగా ఉంటే అదే నాకు చాలు. రీచ్ అయ్యాక, బయలుదేరేముందు మెసేజ్ చెయ్యి" అని అన్నప్పుడు తన ముఖంలో ఆందోళన కనపడి నేను మళ్ళీ ఏ పార్టీ ప్రసక్తి తీయలేదు, వెళ్ళలేదు.

ఎప్పుడైనా మా అమ్మ 'నో' అనడం విన్నానేమో కానీ, నాన్న 'నో' అనడం ఈ రోజుకీ వినలేదు. "నాన్న ఇష్టం" అని అమ్మ, "అమ్మ ఇష్టం" అని నాన్న అంటే 'నో' అని అర్థం. అలాగే, పిల్లలపై అరవడం ఇష్టపడని మా నాన్న సహనానికి హద్దులేదు.

ఒకసారి కోపంతో వస్తువులన్నీ ధ్వంసం చేస్తున్న నేను మా అమ్మ మాట వినకపోవడంతో మా నాన్నకి విషయాన్ని వివరించింది. ఆయన "ఓ. అలాగా" అన్నారు.

"అలాగా ఏంటి? మీరు చెపితే వింటుంది" అని మా అమ్మ అంది.

"సరే" అని ఆయన తిరిగి రాసుకోసాగారు. దాంతో నాకొచ్చిన కోపం మా అమ్మకి అంటి "అక్కడ అది నా మాట వినదు, ఇక్కడ మీరు నా మాట వినరు" అనడంతో నేను, మా నాన్నా నవ్వుకున్నాం.

చిన్నప్పుడు కావ్య అల్లరి చేస్తుండగా, "అల్లరి చెయ్యకమ్మా అమ్మ వచ్చి కొడుతుంది" అని మా నాన్న అనడం విని, "అక్కడెక్కడో ఉన్న అమ్మ వచ్చి కొడుతుంది అనే బదులు 'నేను కొడతాను' అనచ్చుగా' అని ఒకావిడ ఆశ్చర్యపోయారట. మాట వరసకి కూడా 'తిడతాను, కొడతాను' అని మా నాన్న అనడం నేను ఎరగను. నా చిన్నప్పుడు "లిపి అల్లరి చేస్తుంది. వద్దని చెప్పు పద్మ" అని మా నాన్న, "నేనెందుకు? మీరే చెప్పచ్చుగా?" అని మా అమ్మ చర్చ మొదలు పెట్టడంతో నా అల్లరి ఆగేది. ఇంట్లో ఆఖరివారిని ఎక్కువగా గారాబం చేస్తారని అందరికీ తెలిసిందే "చిన్న పిల్ల కదా చాక్లెట్ ఇద్దాం", "చిన్న పిల్ల కదా ఆడుకోనిద్దాం", "చిన్నపిల్ల కదా,

పోనీలే"లాంటివి గారాబం అని నేను చాలా ఏళ్ళు భ్రమపడ్డాను. దానికి సరైన అర్థాన్ని నేను ఇంజనియరింగ్ చదువుతుండగా తెలుసుకున్నాను.

ఓ రోజు ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్తానని నేను, చుట్టాల పెళ్ళికి రమ్మని మా అమ్మ మాట్లాడుకున్నాం. యధావిధిగా రెండుసార్లు 'రాను' అనగానే 'సరే, నీ ఇష్టం' అని పనిలో పడింది మా అమ్మ. ఏదో విషయం చెప్పడం మర్చిపోయిన నేను తన గదిలోకి వెళ్తుండగా "అదేంటి? అది రానంటే సరే అన్నావు. నేను రానంటే రావాల్సిందే అన్నావు?" అని మా నాన్న అడిగారు.

"ఒకసారి కావ్య కూడా ఇలానే ఫ్రెండ్స్‌తో బయటికి వెళ్తా అంటే 'కాదూ, కూడదూ' అని నాతోపాటు తీసుకెళ్ళానని అలిగింది. బలవంతంగా ఆరోజు తీసుకెళ్ళి దాన్ని నొప్పించానని ఈరోజుకీ నాకు బాధగా ఉంది. అదే తప్పు లిపి విషయంలో చెయ్యడం ఇష్టంలేక సరే అన్నాను" అని చెప్పింది.

ఆ సంభాషణ విన్నప్పటినుండి నేను మా అమ్మకి ఎదురు చెప్పలేదు.

ఒకరోజు ఊహ సెలవుల్లో ఇండియాకి వచ్చినప్పుడు నేను మా అమ్మ హాండ్ బాగ్‌లోంచి కొంత డబ్బు తీసుకుని "బాయ్ అమ్మ, ఈవినింగ్ వస్తాను" అని బయటికి వెళ్ళబోతుండగా ఊహ అడ్డుపడి, "అమ్మా ఇది చెప్పకుండా నీ బాగ్‌లోంచి డబ్బులు తీసుకుంది. కనీసం ఎక్కడికి వెళ్తుందో కూడా అడగవా? నేను, అక్కా ఎప్పుడైనా ఇలా చేసామా? దీన్ని అసలు చెడగొడుతున్నావు" అని అరుస్తుండగా మా అమ్మ వచ్చి "లిపిని 'ఎక్కడికి వెళ్తున్నావు? ఎంత ఖర్చు చేస్తున్నావు? ఎప్పుడు వస్తావు?'లాంటి ప్రశ్నలు అడిగితే నా పెంపకాన్ని నేను ప్రశ్నించినట్టే" అని లోపలికి వెళ్ళిపోయింది. ఊహని వెక్కిరిచ్చి బయలుదేరిన నేను ఆ రోజంతా నా ఫ్రెండ్స్‌కి ఆ సంభాషణని పదే పదే చెప్పి మురిసిపోయాను. ఆ రోజునుండి ఎన్నడూ తలవంపు తెచ్చే పనుల ఛాయకికూడా వెళ్ళలేదు. భయం, భక్తితో కన్నా ప్రేమానురాగాలతో పిల్లల్ని తీర్చిదిద్దాలన్న మాటలకి ఉదాహరణే మా అమ్మా, నాన్న.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story